AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

జోరుగా మంజూరు.. క్షేత్రస్థాయిలో బేజారు

2



2

కళ కళలాడుతున్న జలాశయాలు

16న జిల్లాస్థాయి చెస్‌పోటీలు..

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికలకు చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆకుల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. 16న ఉదయం 9 గంటలకు 'బృంద ఒలింపియాడ్ స్కూల్'లో నిర్వహిస్తామని తెలిపారు. 2009 జనవరి 1వ తేదీన లేదా ఆ తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనడానికి అర్హులని ఆయన వివరించారు. ఆసక్తిగల వారు తమ జనన ధృవీకరణ పత్రం, సొంత చెస్ బోర్డును వెంట తెచ్చుకోవాలని.. వివరాల 9440007004లో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుల సంక్షేమంపై దృష్టిపెట్టాలి: అర్వింద్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దివ్యాంగుల సంక్షేమంపై దృష్టిపెట్టాలని ఎంపీ అర్వింద్ అన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌ను న్యూఢిల్లీలో బుధవారం కలిశారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్యలపై వారిరువురు చర్చించారు. దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపీ కేంద్రమంత్రికి వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

సనాతన ధర్మం గురించి ప్రతిఒక్కరికి వివరించాలి..

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: సనాతన ధర్మం గురించి ప్రతిఒక్కరికి వివరించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో మాతృశక్తి, దుర్గావాహిని సంస్థ మహిళలతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రాంత మాతృశక్తి సంయోజిక పద్మశ్రీ, ప్రాంత సహ సంయోజిక శ్రీవాణి మాట్లాడారు. ఈ కార్యక్రమం అనంతరం మాతృశక్తి ఇందూరు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సంయోజిక్‌గా గాయత్రి, జిల్లా సహ సంయోజిక్‌గా జమున, నగర సంయోజిక్‌గా అర్చన, సహ సంయోజిక్‌గా లాస్య, సత్సంగ్ ప్రముఖ్‌గా సుశీల, బాల సంస్కారకేంద్ర ప్రముఖ్‌గా భాగ్య, సేవా ప్రముఖ్‌గా శ్యామల ఎన్నుకున్నారు.

వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచి, అర్హులైన ప్రతి రైతుకూ సంక్షేమ ఫలాలు చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ' (రైతు డిజిటల్ నమోదు) ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలో కీలకంగా మారింది. అయితే కొంతమంది రైతులు ఇప్పటికీ తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోకపోవడంతో వారికి ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే అవకాశం ఉంది.

- అక్షరటుడే, భీమ్‌గల్

ఫార్మర్ ఐడీ లేకుంటే పథకాలన్నీ బంద్..!

■ జిల్లాలో 81శాతం పూర్తి.. ■ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు 54,213మంది
■ అవగాహన లేక రైతులు రిజిస్ట్రేషన్‌కు దూరం ■ చర్యలు తీసుకుంటున్నామంటున్న అధికారులు

జిల్లా వ్యవసాయ శాఖ తాజా గణాంకాల ప్రకారం (ఈనెల ఏడో తేదీ నాటికి) జిల్లాలో ఉన్న 2,92,639 మంది రైతుల లక్ష్యానికి గానూ ఇప్పటివరకు 2,38,426 మంది నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 81.47 శాతం నమోదు నమోదైంది. ప్రభుత్వం నిర్దేశించిన 100శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఇంకా 54,213 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంది.

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లోనే ఎరువుల కేటాయింపు..

ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' యాప్ ద్వారానే రాయితీ ఎరువుల పంపిణీ సాగుతోంది. యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఏ రకమైన రాయితీ ఎరువులు కావాలన్నా విక్రయ కేంద్రాలు లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద ఫార్మర్ ఐడీ లేదా దానికి అనుసంధానించిన ఆధార్ సంఖ్యను సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ వేదికగా వివరాలు సరిపోలితేనే సబ్సిడీ ధరపై ఎరువుల బుకింగ్ జరిగి పంపిణీ చేస్తారు.

లక్ష్య సాధనలో 'మోర్తాడ్' ఫస్ట్..

జిల్లాలోని మండలాల వారీ ప్రగతిని పరిశీలిస్తే, మోర్తాడ్ మండలం 86.21శాతం నమోదుతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు , ప్రజాప్రతినిధులు, రైతులు భాగస్వాములు కావడంతో ఇక్కడ నమోదు వేగవంతంగా సాగింది.

అట్టడుగున 'నిజామాబాద్ సౌత్'!

జిల్లాలోని భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ సౌత్ మండలాల్లో ఆశించిన స్థాయిలో రైతులు తమ పేర్లను ఆధార్ నంబర్‌ను రిజిస్టర్ చేసుకోలేదు. పట్టణ పరిసర ప్రాంతమైన నిజామాబాద్ సౌత్ మండలంలో అత్యల్పంగా కేవలం 29.13శాతం మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఫార్మర్ ఐడీ ఆధారంగా విత్తనాలు, ఎరువుల కేటాయింపు సాగుతుంది. పీఎం కిసాన్, రైతు భరోసా, వర్షాలు, కరవు వల్ల పంట నష్టపోతే వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారం ఏ మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడతాయి.

రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి..

ఫార్మర్ ఐడీ నమోదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయి. జిల్లాలో ఇంకా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోని 54,213 మంది రైతులు వెంటనే తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించాలి. పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ వివరాలు అందించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, సంక్షేమ పథకాలు అందాలంటే ఈ నమోదు తప్పనిసరి.

- వీరాస్వామి,
జిల్లా వ్యవసాయ అధికారి, నిజామాబాద్

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్‌డబ్ల్యూయూ కృషి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్‌డబ్ల్యూయూ కృషి చేస్తోందని కాంగ్రెస్ నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్టీసీ డిపో-2 ప్రాంగణంలో ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ శ్రమిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖలోని ఎయిడ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణలో భాగంగా రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఎటువంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 200 కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే దీనిపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే యువత అవగాహన కోసం బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి దేవి నాగేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సికందర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ వెంకన్న, డాక్టర్ సుప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ ఘన్‌పూర్ వెంకటేష్, డీపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా బోధన చేయాలి..: కలెక్టర్

అక్షరటుడే, బాన్సువాడ: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా విద్యాబోధన కొనసాగించాలని, విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతులు, భోజన సదుపాయాలు, విద్యార్థుల అభ్యాస స్థాయి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహన, చదువులో ఎదురవుతున్న ఇబ్బందులు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను

పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహశీల్దార్ నరేందర్‌గౌడ్, ఎంపీడీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఫోటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

అక్షరటుడే, బాన్సువాడ: జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో బాన్సువాడ మండల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా అరుణ్, ప్రధాన కార్యదర్శిగా పి. సాయిలు, కోశాధికారిగా కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సభ్యుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సమీర్, ప్రధాన కార్యదర్శి సవీన్, కోశాధికారి బద్దం రాజు, ఉపాధ్యక్షులు పిట్ల రాజు, కార్తీక్, జాయింట్ సెక్రటరీలు భూపతి, సతీష్, కృష్ణ హాజరయ్యారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి..: కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. ఎడపల్లిలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయాన్ని, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాలలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేజీబీవీ పాఠశాలల పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీచేశారు. సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతోకూడిన క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని, పాఠశాలల ప్రవేశ మార్గంలో ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కేజీబీవీలో బాలికల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్,

ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే విషయమై సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడతానన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహారీ నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ దత్తాత్రి, ఎంఈవో గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

బోధన్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు కృషి చేయాలి: సీపీ

అక్షరటుడే, బోధన్: బోధన్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. కోటగిరి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని సీపీ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై క్షుణ్ణంగా సమీక్ష చేశారు. సైబర్ నేరాలపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు సాయం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో జరిగిన హత్య, హత్యాయత్నం, చోరీలు మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై నమోదైన కేసులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ పరిధిలో నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సాయిచైతన్య తెలిపారు. రౌడీషీటర్లు పాత నేరస్తులు, బెయిల్‌పై విడుదలైన వారిపై పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని పేర్కొన్నారు. డయల్ 112 గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐ విజయ్‌బాబు, ఎస్సైలు, ఐటీ కోర్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుంచి గీతన్నల చైతన్య బస్సుయాత్ర

అక్షరటుడే, కామారెడ్డి: కల్లుగీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గీతన్నల చైతన్య బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ ప్రకటించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేణుక ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. కల్తీ పేరుతో కల్లుగీత వృత్తిపై పథకం ప్రకారం జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, యాత్ర బృంద సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, గైని వెంకన్న, బండ కింది అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి డి.రాజా గౌడ్, ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, రమేష్ గౌడ్, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

దేగాంలో చేయూత పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి ఆధ్వర్యంలో చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. చేయూత పెన్షన్ కోసం అర్హులైన వారు ఎలాంటి ఆందోళన చెందకుండా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్లు మంజూరయ్యేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే గ్రామపంచాయతీ లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో వందశాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో వందశాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తయిందని ఆర్డీవో ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఓటరు జాబితా సవరణలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 2,28,503 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, వాటిని బీఎల్‌వో యాప్ ద్వారా 100శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశామన్నారు. పరిశీలనలో 22,469 ఫారాలు మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, డబుల్ ఓటర్లుగా గుర్తించామన్నారు. ఈ నెల 17న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని తెలిపారు.

కరెంట్ షాక్‌తో లైన్‌మన్‌కు గాయాలు

అక్షరటుడే, డిచ్‌పల్లి: ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి జూనియర్ లైన్‌మన్ హిమాద్‌కు కరెంట్ షాక్ తగిలింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. షాక్ కొట్టగానే అరచేయి కాలిపోగా..పైనుంచి పడడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రైతులు వెంటనే అతన్ని నిజామాబాద్‌కు తరలించగా..ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

జోరుగా మంజూరు..

క్షేత్రస్థాయిలో బేజారు

■ గాంధారి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి ■ నిరాశజనకంగా సాగుతున్న నిర్మాణాలు ■ అధికారులు పట్టించుకోవట్లేదని విమర్శలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఎంపిక నుంచి అధికారుల పర్యవేక్షణ వరకు యాప్ ద్వారా మానిటరింగ్ చేస్తోంది. అయితే గాంధారి మండలంలో నిర్మాణాలు ముందుకు సాగకపోవడంపై అధికారులు సైతం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

– అక్షరటుడే, గాంధారి

గాంధారి మండలంలో రెండు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేశారు. మొదటి విడతలో 585 ఇళ్లు.. రెండోవిడతలో 186 ఇళ్లు మంజూరయ్యాయి. అయితే మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేసి ఏడాది గడుస్తున్నా చాలావరకు ఇళ్లు ప్రారంభదశలోనే ఉండడం గమనార్హం. మొత్తంగా 771 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేయగా.. కేవలం 80మంది మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేశారు. అయితే ఇందులో 220 ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ లెవల్‌లో ఉండగా

మిగితా 471 ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయి.

లేబర్లు దొరకక ఇబ్బందులు..

లబ్ధిదారులు కొంత పెట్టుబడి పెట్టి ఇళ్లు ప్రారంభించారు. మరికొందరికి డబ్బుల అందకపోవడంతో కొన్ని నిర్మాణాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అలాగే కొన్ని ఇళ్లు మేస్త్రీల దొరకకపోవడంతో నిలిచిపోయాయి. దాదాపు 800 వరకు మంజూరైన ఇళ్లలో 80 మాత్రమే గృహప్రవేశం వరకు వెళ్లాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణంలో బేస్మెంట్ వరకు రూ.లక్ష, గోడలు పూర్తయితే రూ.లక్ష, స్లాబ్ వర్క్ అయితే మరో రూ.లక్ష, కలర్ పెయింట్లు పూర్తిగా వేస్తే రూ.లక్ష ఇలా విడతలుగా ఇస్తోంది. ఈజీఎస్ పథకం ద్వారా రూ.14 వేలు బాత్‌రూం నిర్మాణానికి ఇస్తుంది.

జాప్యం లేకుండా పనులు పూర్తి చేయించాలి..

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు తానాజీ రావు అన్నారు. మొత్తంగా గాంధారిలో సుమారు 800 ఇళ్లు మంజూరవ్వగా కేవలం 80మాత్రమే పూర్తవ్వడం అధికారుల జాప్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అర్హులైన ప్రతిఒక్కరి ఇందిరమ్మ ఇల్లు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం..

ఇందిరమ్మ ఇళ్ల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన లబ్ధిదారులు ఇళ్లు కట్టుకున్నట్లుగా వారి ఖాతాల్లో నిధులు జమ అయిపోతున్నాయి. కాకపోతే నిర్మాణక్రమంలో లబ్ధిదారులు జాప్యం చేయడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షం కూడా కారణంగా చెప్పవచ్చు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వర్, ఎంపీడీవో గాంధారి

బాల్కొండ మండల పరిషత్‌లో అభివృద్ధిపై చర్చ

అక్షరటుడే, బాల్కొండ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక అధికారి రాకేష్ అధ్యక్షతన మండల స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

తెయూ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీటెక్ (సీఎస్ఈ), ఏఐ కోర్సులలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 16 తేదీ వరకు వెలువడే యూనివర్సిటీ స్పాట్ అడ్మిషనన్లలో టీజీఈఏపీసీఈటీ 2026లో అర్హత పొందిన, పొందని విద్యార్థులు, ఇంటర్మీడియట్ (ఎంపీసీ)తో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

అన్నిదానాల్లోకెల్లా అన్నదానం మిన్న..

అక్షరటుడే, ఆర్మూర్ : అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ ఈవో కులచారి రఘునాథ్ అన్నారు. బుధవారం ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు నగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో జంబి హనుమన్ ఆలయంలోని అయ్యప్ప దేవాలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పుట్టి మురళి, కార్యదర్శి మీసాల రవి, కోశాధికారి గాజరెడ్డి నర్సారెడ్డి, సలహాదారులు ప్రభు దత్తు, జనార్దన్ గౌడ్, ఖాందేశ్ శ్రీనివాస్, మీసాల రాజేశ్వర్, అశోక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు నర్మే నవీన్, శాల ప్రసాద్, భూపేందర్, బొగడ మీది సుమన్, జంబి హనుమాన్ ఆలయ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ బీజేపీ ఫ్లోర్ లీడర్ ద్యాగ ఉదయ్, కౌటిక విజయ్, గోవింద్ పేట్ లింగారెడ్డి, నవీన్ రెడ్డి, మీసాల మహేష్, శేఖర్, గంగాధర్ గౌడ్, ఒడ్డెన్న, జన్నేపల్లి రంజిత్, శుభం, నవీన్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల కళాశాలలో ఆర్డీవో తనిఖీ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి కళాశాలను ఆర్డీవో ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, హాస్టల్, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం మరియు విద్యార్థినులకు అందుతున్న ఇతర సౌకర్యాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినుల హాజరు, అధ్యాపకుల బోధన, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీవో ప్రభాకర్ తహశీల్దార్ ప్రేమ్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనంలో చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి చదువులు, వసతి గృహంలో సౌకర్యాలు, భోజన నాణ్యత గురించి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా చెప్పాలని సూచించారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో సర్పంచ్ భర్త జోక్యమెందుకు..?

అక్షరటుడే, భీమ్‌గల్: ప్రజాసమస్యల పరిష్కారంలో బడా భీమ్‌గల్ సర్పంచ్ భర్త జోక్యం తగదని కాంగ్రెస్ మండల జనరల్ సెక్రెటరీ రాగుల మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలై ఆర్నెళ్లు కావస్తున్నా సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధిని ప్రధాన వాగ్దానాలను అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. గ్రామానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని, యువత కోసం జిమ్ ఏర్పాటు చేస్తామని, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని చెప్పి ఓట్లు వేయించుకున్నారని గుర్తుచేశారు. గెలిచాక ఆ హామీలను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచ్ స్థానంలో ఉన్న మహిళ కంటే, ఆమె భర్త (ఉప సర్పంచ్) శంకర్‌గౌడ్ జోక్యమే ఎక్కువగా ఉందని నాయకులు ఆరోపించారు. సర్పంచ్ భర్త పెత్తనం కాకుండా ప్రజాస్వామ్యబద్ధమైన పాలన సాగేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాగుల లింబాద్రి, ఆకుల గంగాధర్, జంగం ప్రభు, రాగుల కిషన్ పాల్గొన్నారు.

కళకళలాడుతున్న జలాశయాలు.. ఆనందంలో రైతన్నలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న భారీ వరదలతో కామారెడ్డి జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయి. నిజాంసాగర్ 12 టీఎంసీల నీటిమట్టానికి దాటగా, కౌలాస్ నాలా ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరుకుంది. పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లుతోంది. సింగీతం కళ్యాణి ప్రాజెక్టులో సైతం నిండుకుండలా మారాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం చేరడంతో తమ పంటలు పండుతాయని జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద రావడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 12.12 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు లో 1,400 అడుగుల వద్ద 12.007 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి సామర్థ్యం 1,405 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు దాదాపు 65శాతం నిండింది. వరద ఇలాగే కొనసాగితే మరికొద్ది రోజుల్లో ఫుల్ అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరమ్మతుల కారణంగా డెడ్ స్టోరేజీకి చేరిన జుక్కల్ కౌలాస్ నాలా ప్రాజెక్ట్, వరుస వర్షాలతో తిరిగి నిండు కుండలా మారింది. ప్రస్తుతం 457.40 అడుగుల వద్ద 1.095 టీఎంసీల నీరు ఉంది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరడంతో వరద గేట్లు, మత్తడి పైనుండి నీరు పొంగి పొర్లుతోంది. కళ్యాణి రిజర్వాయర్‌లో నీరు నిండటంతో గేట్లు ఎత్తివేశారు. గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. సింగితం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటితో గేట్లు ఎత్తివేశారు. నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి సైతం నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిండటంతో ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీటి ఇబ్బంది ఉండదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముప్కాల్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర

అక్షరటుడే, ముప్కాల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ముప్కాల్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలల విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా యాత్ర కొనసాగింది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.